


# తెరలు

- ఆదూరి వెంకట సీతారామమూర్తి -

అర్ధరాత్రి పెళ్ళవగా సాయంత్రమున్న పెళ్ళివారిల్లులా వాల్తేరు స్టేషను కలకల్లాడుతోంది. సుదీర్ఘమైన వైవాహిక జీవితాన్ని వూహించుకుంటూ కోర్కెల పరుగులు మనసున ఉరకలు వేస్తూన్న పెళ్ళికూతుర్లా గోదావరి ఎక్స్‌ప్రెస్ బయల్దేరే ముహూర్తంకోసం చూస్తూంది. పురోహితుడి గొంతులా ఇంజను ఓయ్ మంటు క్రరకు చుట్టిన పచజెండాను విప్పుతూ బండెక్కాడు గార్డు.

సరిగ్గా ఆ సమయంలో సూట్‌కేస్ చేత్తో పట్టుకుని వగురుస్తూ పరుగెత్తుకుంటూ త్రీటైర్ స్లీపర్ కోచ్ దగ్గరకు వచ్చాడు ఆనందరావు. అతని కంటె ఒక అడుగు ముందొచ్చిన అతని స్నేహితుడు శాస్త్రి కంపార్టుమెంటుకి అంటించిన రిజర్వేషన్ లిస్టులో ఆనందరావు పేరుందని నిర్ధారించాక సూట్ కేస్ కంపార్ట్మెంట్లోకి తోసి, ఎక్కేశాడు.

గార్డు పచ్చజెండా వూపేడు.

శాస్త్రి చెయ్యి వూపేడు.

ఒక్క వూపుతో బండి కదిలింది.

శాస్త్రినీ, కేఫీరియానూ, హిగిన్‌బాథమ్స్‌నూ, వాల్తేరు స్టేషన్‌నీ వదిలి గోదావరి ఎక్స్‌ప్రెస్ పట్టాల మీద పరుగు లంకించుకుంది.

గతన్ని మరచి కాస్సేపు భవిష్యత్తులో సంచరించి వర్తమానంలో కొచ్చాడు ఆనందరావు. రిజర్వేషన్ కంపార్ట్మెంటు చాలా ఖాళీగా ఉంది.

పెద్దపండగ వాడూ పులైనా బయల్దేరదంటారు. తను పులీ కాడు — పిల్లీ కాడు.

రైలు వేగాన్నందుకుంది — ఆనందరావు సూట్‌కేస్ తెరిచి బెడ్ షీటు క్రింద బెర్తు మీద పరచుకుని కాలక్షేపానికి తెచ్చుకున్న పత్రిక ముందేసుకుని కూర్చున్నాడు.

ఎదుటి సీట్లో కూర్చున్న ఇద్దరబ్బాయిలు కాలేజీల గురించీ ఉద్యోగాల గురించీ కాక, సిన్మాల గురించి గట్టిగా మాట్లాడుకుంటున్నారు.

ఆనందరావుకి పత్రిక మీద మనసు నిలవడం లేదు. హీరో హీరోయిన్ల కెంతెంత డబ్బిస్తారో, ఫలానా పిక్చరు హిట్టవడానికి కారణ మేమిటో మొదలైన ఉప్పూ కారం లేని పేలాల్లాంటి మాటలు ఆనందరావు చెవుల్లో గింగురుమంటూనే ఉన్నాయి.

ఆనందరావుక్కూడా సిన్మాలు చూస్తాడు. వాటిలోని కథ, దర్శకత్వపు విలువలు, ఫొటోగ్రఫీ, సాంకేతిక లోపాలు, నటనల్లోని సమర్థతలు, అసమర్థతలు అన్నీ చర్చిస్తాడు. కానీ ఈ సందర్భంలోకి మాత్రం వాళ్ళ మాటలు కర్ణ కఠోరంగా అన్పించాయతనికి.

అ వయసులోని వాళ్ళు నేటి విద్యా విధానం గురించో, క్రికెట్ ఆట గురించో రాజకీయచైతన్యం గురించో పత్రికల గురించో మాట్లాడితే బాగుంటుంది. జీవితంలో ఏ సమస్యలూ లేనట్టు టీనేజిలో సిన్మాల టాపిక్కే దొరికిందా వాళ్ళకి'' అనుకున్నాడు.

అనకాపల్లిలో బండి ఆగి, బయల్దేరింది. పెట్టెలో సందడి లేకపోతే తిరిగి చూశాడు ఆనందరావు. వాళ్ళిద్దరూ లేరు. ఫ్లాట్‌ఫారం వంక చూస్తే దూరంగా సిన్మా పోస్టర్‌ని చూస్తూ వాళ్ళు కన్పించారు. అప్పటికిగాని ఆనందరావు దృష్టి పుస్తకం మీద నిలవలేదు. నిలిచాక అందులో మునిగి పోయాడు.

బండి ఏదో స్టేషణలో ఆగినట్టయితే చూశాడు. యలమంచిలి! స్టేషన్ సందడిగా లేకపోవడంతో మళ్ళీ పుస్తకంలో మునిగిపోయాడు.

బండి బయల్దేరే వేళకి ఎదుటి బెర్తు మీదికి ఎవరో వచ్చినట్లయితే తలెత్తి చూశాడు.

సన్నజాజుల నుండి మొదలుపెడితే ...బ్రా కన్పించే లోనెక్ జాకెట్ మీంచి క్రిందికి దిగి, మరీ అంత ఉందీ లేదూ అన్పించనంత సన్నని కాని నడుము మీద నాట్యంచేసి, క్రీమ్ కలర్ జార్జెట్ చీర చుట్టబడిన పిరుదుల మీదకు గుబేలున గెంతి అక్కడితో ఆగిన జవరాలి జడ కన్పించింది.

జడ ఆడదాని కింత అందాన్నిస్తుందా అనుకుని ఆశ్చర్యపోయాడు ఆనందరావు వెనుకనుండి ఆమెను చూసి. చక్కని పెర్సనాలిటీ. మరి ముఖారవిందమెటువంటిదో!

ఆమె సామాన్లు మీది బెర్తు మీద సర్దుతోంది.

సభ్యతకోసం చూపు మరల్చుకోక తప్పలేదు ఆనందరావుకి.

సామాను సర్దడం పూర్తిచేసి ఎదురుగా కూర్చుందామె తలెత్తి ఆమె వంక చూసి నిశ్చేష్టుడయ్యాడు. ఆనందరావు. ఆ క్షణంలో ఆమె చూపులూ ఇటు తిరిగాయి. ఆశ్చర్యార్థకాలూ, నవ్వుల చిలకరింపులూ, పలకరింపులూ!

"సుజాతా ... నువ్వా!'' అన్నాడు ఆశ్చర్యంగా.

అవునన్నట్లు తలూపినా ఆశ్చర్యం నుంచితేరుకోలేనట్లు "నువ్వేనా, ఆనందా! నే చూస్తున్నది నిజమేనా'' అంది. ఆనందమూ, ఆశ్చర్యమూ కలిసిన ఆ సమయంలో నోటంట మాట రాక. అవునన్నట్లు తలూపాడు.

ఎప్పటి సుజాత!

సుమారు ఆరేళ్ళ క్రితం కన్నీళ్ళతో తనముందు నిల్చుని, "ఇక పిరికితనం వదిలి ముందడుగువేస్తే నే

గాని మన జీవితాల్లో మిగిలేదేంఉండదు.ఆలోచించు, ఆనందరా!'' అని తన నోటిమాటకోసం ఆగిన సుజాత!

అంతకు ఏడాది క్రితం ''అబ్బో! ఈ బుద్ధావతారం -న్మాలుకూడా చూస్తుందే'' అని ఆర్ట్స్ కాలేజీఆవరణలో స్నేహితురాళ్ళ నవ్వుల్లో నవ్వు కలిపి తన వంక హేళనగా చూసిన సుజాత!

ఆ తర్వాత ఆర్నెల్లకు తన మనసులోనిది చెబితే ''అబ్బో! ప్రేమ పాటాలు కూడా వచ్చే! ఏమో అనుకున్నా''అని కళ్ళెత్తి తనలోకి చూసిన సుజాత!

తను వదులుకున్న సుజాత!

కానీ అప్పటికీ, ఇప్పటికీ సుజాతలో ఎంతమార్పు!

పెళ్ళి స్త్రీకి పరిపూర్ణత నిస్తుంది మరి!

''ఏమి టలా చూస్తున్నావ్. నాలో ఏమైనా మార్పు కన్పిస్తూందా'' అంటూ నవ్వింది సుజాత.

ఆ గొంతులో ఆకర్షణ ఉంది. ఆ నవ్వులో ఆకర్షణ ఉంది. నవ్వితే సొట్టలుపడే ఆ బుగ్గల్లో ఆకర్షణ ఉంది.

ఆనందరా వేం మాట్లాడకపోవడం చూసి, ''సాన్లే, పోల్చుకున్నావ్. అంతే చాలు. మళ్ళీ జీవితంలో నిన్ను చూస్తాననుకోలేదు. ఏం చేస్తున్నావ్ ఏమిటి?'' అని ప్రశ్నించింది.

ఏం చేస్తున్నదీ చెప్పి, అంతటితో తన బాధ్యత అయిపోయినట్లు ఊరుకున్నాడు ఆనందరావు.

''అప్పటికన్నా నువ్విప్పుడే బాగున్నావ్. కాస్త ఒళ్ళుకూడా చేశావు'' అంది.

నవ్వుతూనే సమాధానమిచ్చి ఊరుకున్నాడు.

అది చనువా? కవ్వింపా? తేల్చుకోలేకపోయాను.

''నా సంగతులేం అడగవేం?'' అంది.

''అడిగి చెప్పించుకునే కంటె అడక్కుండానే తెల్సుకుంటే బాగుంటుందని'' మాటపూర్తికాలేదు.

''భలేవాడివే! జీవితం నీకు...గడుసుదనం కూడా నేర్పినట్లుంది!'' అంటూ ఫ్లాస్కు తీసి కాఫీ ఇద్దరికీ సర్దింది.

''మే మిప్పుడు విజయవాడలోనే ఉంటున్నాం. నీలా మా వారికి గవర్నమెంటు ఉద్యోగం లేదు. ఆయనొక పబ్లిషరు. సొంత ప్రెస్సూ, ఒక డాబా ఇల్లూ ఏలూరురోడ్లో ఉన్నాయి.'' కాఫీ సిప్‌చేస్తూ వెనక్కు జారగిలబడి ఆనందరావువంక చూసింది.

''ఇంకేం? ఏ గవర్నమెంటుద్యోగం పనికొస్తుంది దాని ముందు—మొత్తానికి అదృష్టవంతురాలివే'' అన్నాను ఆనందరావు కాఫీ పూర్తిచేసి ఖాళీ కప్పు ఆమె చేతి కిస్తూ.

''ఏం అదృష్టమో! జీవితంలో మనం కోరుకున్న వన్నీ జరగవు—డబ్బులా, హోదాలా అదృష్టాలని నే ననుకోను'' అంది— ఆ మాటల వెనక తీరని పొందలేని బాధ ఉందా అన్పించింది ఆనందరావుకి.

''ఇంతకి నీ కెంతమంది పిల్లలో చెప్పావు కాదు.''

ఆనందరావు నవ్వి ఊరుకున్నాడే గాని, జవాబు చెప్పలేదు. అదే ప్రశ్నని మళ్ళీ ఆమె రెట్టించడంతో ''ఇంకా లేదు — పెళ్ళయ్యాక ఏదాద్దామని ఊరుకున్నా'' అని, ఆమె ముఖంలోని భావాన్ని చూడ్డానికి ప్రయత్నించాను.

''ఏమిటీ—ఇప్పటికి పెళ్ళి చేసుకోలేదా? నా




పూప్-సీ® పొందండి

పూప్-సీ ఫీడర్ పిల్లలకు అతి ఆవశ్యకమైనటువంటి స్వాభావికమైన ఆనందాన్ని ఇస్తుంది.



మీరు పిల్లలకు పాలివ్వ వలెనని ఎంత. ఆరాట పడ్డప్పటికి కొన్ని సమయాల్లో ప్రకృతి మీకు సహకరించక పోవచ్చును.

దిగులు చెందకండి. పూప్-సీ ఫీడర్‌ని నమ్మండి. అది మీరు పిల్లకి ఇచ్చే ప్రేమని రక్షణని ఇస్తుంది. పిల్లలు హాయిగా మృదువుగా చప్పరించుతూ సుఖముగా పాలు త్రాగుటకు కావలసిన విధంగా

మృదువైన నిప్పల్, తగు మోతాదులో పాలువచ్చేటట్లు సీసా ప్రత్యేకంగా తయారు చేయబడినది. పిల్లలు వారి పాలకోసం బాధపడ నవసరం లేదు. పాలు ఇచ్చేటప్పుడు ఏ విధమైన కష్టము ఉండదు—పాలు పట్టిన తరువాత వారు ఏ మాత్రము అలసిపోరు.

మీ పిల్లలకు పాలు పూప్-సీ ఫీడర్‌తో ఇవ్వండి వారు నిజంగా తృప్తిగా ఉంటారు. కారణం వారికి సరియైన పోషకపదార్థం లభిస్తుందిగనుక. పిల్లలు పెరుగుతున్న కొలది, పూప్-సీ ఫీడర్‌ని నమ్మినందు వలన మీరు సంతోషిస్తారు.



పూప్-సీ®

భారత దేశంలో అత్యధికంగా అమ్మబడుతున్న బేబిఫీడర్స్ మరియు నిప్పల్స్

INNOVATION/BLD/TEL/18

కోసమే?'' అంది చివరి మాటను వత్తి పలుకుతూ.

ఆ తర్వాత చాలా విషయాలు మాట్లాడింది— సొంత విషయాలు, రాజకీయాలు, సంగీతం, సాహిత్యం — సుజాత మాటలు, ఆ వెనుక భావాలు ఆమె ఎదుగుదలకు నిదర్శన మనిపించాయి.

''మాటల్లో మర్చేపోయాం. మనం ఏదో ఒకటి తినొద్దూ? నువ్వు భోంచేస్తావా? టిఫినా'' అంది.

''నాకు ప్రయాణాల్లో భోజనం అలవాటు లేదు.''

''ఇకనేం?'' అంటూ టిఫిన్‌బాక్సూ, పళ్ళూ తీసి బయట పెట్టింది.

టిఫిన్ పూర్తి చేశాక సామాన్లన్నీ సర్ది, పాకెట్ సైజు జపాన్ టేప్ రికార్డర్ తీసి బహదూర్‌షా జఫరాలీ గీతాన్ని పెట్టింది.

''లగ్‌తా నహీఁ హై దిల్ మేరా ... ఉజడే



హై పవర్ సర్ఫ్ అమిత తెల్లగా ఉతుకుతుంది...

అమిత తెల్లగా, కనువిందుగా.

మీ బాబు బట్టలు మురికి చేసుకోవడంలో ఘటికుడా? ఆ మురికి వదలగొట్టడానికి మీకూ ఘనమైనదే కావాలి మరి. అదే హై పవర్ సర్ఫ్.

హై పవర్ సర్ఫ్‌లో ఉంది అతి శక్తివంతమైన ఫార్ములా. దానిలోని హెచ్చు ఉతికే శక్తి మురికినీ, జిడ్డు మరకల్నీ మటుమాయం చేస్తుంది. బాగా మాసిపోయిన దుస్తుల్ని కూడా తెల్లగా మిలమిల మెరిసేలా చేస్తుంది సర్ఫ్. సర్ఫ్, రంగు బట్టలకు కూడా మంచిది. వాటిని పరిశుభ్రంగా, కాంతివంతంగా ఉంచుతుంది. ఇంటిల్లిపాది బట్టలకూ ఉతుకులో అదనపు తెల్లదనం, కాంతీ ఇస్తుంది హై పవర్ సర్ఫ్. ఎక్కువ మంది తల్లులు మరే ఇతర వాషింగ్ పౌడర్‌కు బదుకు సర్ఫ్‌నే వాడటంలో మరి ఆశ్చర్యం ఏముంది గనక ?




ఎక్కువ మంది తల్లులు మరే ఇతర వాషింగ్ పౌడర్‌కు బదులు సర్ఫ్‌నే వాడతారు.

హిందూస్తాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి. లింటాస్-SU. 220-203 TL

దయ్యార్ వే
కిస్ కీ బనీహై ఆలమే, వో సౌంజుదా హమే ..."

రఫీ గొంతులో అందమైన భావాలు పలుకుతుంటే, ఎదురుగా ఉన్న ఒకప్పటి ప్రేయసిని చూస్తూ ఊహాలోకాల్లో తేలిపోయాడు ఆనందరావు.

అందమో, ఆకర్షణో ఒక వయసులో ప్రేమకు గురి చేస్తాయి.

అయితే తను సుజాతను ప్రేమించాడా?

లేదేమో!! తాము విడిపోయాక సుజాత నెప్పుడూ తల్చుకోలేదు— మరి ఆమె కూడా అంతేనేమో!

ఇన్నాళ్ళకి ... ఇన్నేళ్ళకి కల్సినా మామూలుగానే ఉంది.

అయితే అప్పట్లో తమది నిజమైన ప్రేమకాదా? ఉత్తి ఆకర్షణేనా?

"ఏమిటో చాలా దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్— కబుర్లేం చెప్పవేం?" సుజాత మాటలకు ఉలిక్కిపడి ఆలోచనల్లోంచి లేచాడు.

జీవితంలోని సంతృప్తి అంతా ఆమె కళ్ళల్లోనే ఉందా అన్పించింది ఆనందరావుకి. ఆమె కళ్ళు కాని ఎంతో ఎదిగినట్లనిపించింది, మానసికంగాను, శారీరకంగాను.

కాస్సేపు ప్వవిషయాలూ, స్నేహితులవిషయాలూ, సంగీతం, సాహిత్యం, సినిమాలూ, రాజకీయాలూ...

టైమ్ పదకొండు దాటింది. రైలు వేగాన్నిపుంజుకుంటూ పరుగులెత్తుతోంది. చల్లగాలి హాయిగా ఒళ్ళంతా నిమురుతూ గిలిగింతలు పెడుతోంది ఇద్దర్నీ.

"నాకు నిద్దరొస్తోంది బాబూ! పడుకునే మాట్లాడుకుందాం, కావలిస్తే" అంటూ లేచింది సుజాత.

హోల్డాలు విప్పి దుప్పటి, దిండు పరిచేసి కూర్చోబోతూ — "నువ్వేం పక్క బట్టలు తెచ్చుకోలేదూ" అని ఆనందరావు వంక చూసింది.

"దుప్పటి ఉంది. నా కది చాలు."

"ఏమోబాబూ, నాకుమాత్రం పక్క సుఖంలేందే నిద్దరాదు. నిద్ర లేకపోతే నా ఒంటికి కుదరదు. అందుకే సుఖాలన్నీ నాతోనే నే నెక్కడి కెళ్ళినా తీసుకుపోతు టాను" అని నవ్వి, "పోనీ ఈ దిండు తీసుకో—నాకు పరుపుందిగా" అంది.

"సుఖాలన్నీ" అన్న మాట గురించి ఆలోచిస్తున్నాడు ఆనందరావు.

మొహమాటపడను సంగకుండా పైకెత్తి బెర్తు మీద వాలిపోయింది సుజాత.

"లైటు ఉంచనా, తీసేయనా?"

"నీ ఇష్టం" అంది కళ్ళు మూసుకుంటూ.

రైలు ఏదో స్టేషన్‌లో ఆగి, మళ్ళీ బయల్దేరింది. బెర్తుమీద ఆనందరావూ కదిలాడు.

ఆలోచనలుఅతనినినిద్రపోనీకుండాచేస్తున్నాయి. వాచీ వంక చూశాడు.

పన్నెండు!

అతనికి ఎదురుగా ఉన్న బెర్తు మీద సుజాత పరిసరాల్ని లెక్కచేయకుండా ప్రకృతిలా మైమరచి

**క్రూరత్వం**

**కఠిన హృదయం, బలహీనత ఆ రెండే క్రూరత్వానికి ఆధారాలు.** —సెనెకా

పరుచుకుని ఉంది. మెడనిండా నగలు, పెదాలు కప్పేస్తూ కుచ్చెళ్ళు— అనుభవాలకు అలసి పరిపూర్ణత పొందిన ఒంపులూ—

ఆనందరావులో ఏవో ఆలోచనలు— ఎప్పటివో జ్ఞాపకాలు!

ప్రేమలో, వెన్నెల్లో తడిసిన ఆ రాత్రులు అప్పటి విరిసీ విరియని పువ్వుల్లాంటి జీవితాలు... ఇప్పుడా స్వచ్ఛత లేదు — కట్టుబాట్ల తెరలు! భర్త కంటె ఒకప్పటి ప్రియుడు గొప్ప కాకూడదు! భార్యకంటె చిన్ననాటి ప్రియురాలు ఆకర్షణీయం కాకూడదు. లిమిటేషన్స్ ... మభ్య పెట్టుకోడాలు... నిజాన్ని చెప్పలేక అల్లిన అబద్ధాలు — ఆ మధ్యలోనే ఎవరికి వారు ఉన్నతంగా కన్పించాలని ఆరాటపడ్డం ... ఇవీ — అనుభవాలు నేర్పిన ఇప్పటి జీవితాలు!

లేచి కూర్చున్నాడు ఆనందరావు. సుజాతలో ఆకర్షణ అతని నరాల్ని కాల్చేస్తున్నాయి. ఒళ్ళంతా సెగలు! ఎంతైనా ప్రియురాలు— తల్చుకుంటే ఎప్పుడో ఆమెను పెళ్ళాడేవాడు — కానీ అప్పటి పిరికితనాని కది సాధ్యం కాలేదు. కానీ ఇప్పటి ఈ పరిస్థితిలో ...

కోర్కెతో కళ్ళు జ్వలించగా లేచి, ఆమె పైకి వంగి రెండు చేతుల్లోనూ ఆమె ముఖాన్ని దగ్గరకు తీసుకున్నాడు.

ఆ అనుభవానికి అలవాటున్న దానిలా కదిలి, కనురెప్పలు కదిల్చి, విప్పి, చటుక్కున లేచింది సుజాత.

"ఏమిటిది, ఆనందూ — నిద్రపోలేదూ."

ఆ గొంతులోని జీర కొత్తగా అన్పించింది ఆనందరావుకి.

"సుజా" అన్నాడు వణికే కంఠంతో. ఆ అవస్థ నామె గుర్తించి లేచి కూర్చుని చీర కుచ్చెళ్ళను దగ్గరకు తీసుకుంది.

"అవకాశం మనిషిని దిగజార్చ కూడదు, ఆనందూ. నువ్వొ నలుగు ర్లాంటి మగాడివే అనుకుంటే నే నింత నిర్భయంగానీ ఎదుట పడుకుని ప్రయాణం చేయుగలనా, చెప్పు?" అంది మందలింపుగా. ఆనందరావేం మాట్లాడక పోవటం చూసి, "నా జీవితంలో మన స్నేహాని కెంతో స్థాన మంది. ఆ విలువ, ఆ స్థానం జీవితాంతం పవిత్రంగా ఉండిపోవాలనే ఆశతో ఉన్నాను.

నా కోసం నువ్వింకా పెళ్ళి చేసుకోలేదంటే, పరిస్థితులు వేరు చేసినా, ప్రేమ నన్ను నీ నుండి వేరు చేయలేదన్న గర్వం, నువ్వింకా నా కోసమే ఆలోచిస్తూ నీ బంగారు భవిష్యత్తు పాడు చేసుకుంటున్నా వన్న విచారం—రెండూ ఒకేసారి కలిగాయి నాలో. నిజానికి ఇప్పుడిగితే కాదనటానికి ఏముంది నా దగ్గర. జీవితాన్నే త్యాగం చేసిన మనం ఒక



చిన్న తప్పుకు, చీకటి పరిస్థితికి లొంగి పోకూడదు" అని తలొంచుకుని "ఆయన ఆపరేషన్ చేయించుకుని ఏడాది దాటింది" అంది.

నిస్సహాయంగా ఆమె వంక చూశాడు ఆనందరావు. సిగ్గు నభినయించే కళ్ళను కాస్త పైకెత్తి, "ప్రేమ కోసం జీవితాన్ని బలి చేసుకోవడం పిరికితనమనిపిస్తుంది,ఆనందూ.ఎంత ఊహాల్లో బతికినా, ఎంత భావుకత ఉన్నా మనిషికి అనుభవాలూ,స ంసార సుఖం, పిల్లలూ, వాటి చుట్టూ ఉన్న ప్రేమ—ఇవి అవసరం. వాటి కోసమైనా నువ్వు పెళ్ళి చేసుకోక తప్పదు!" అని సున్నితంగానే మందలించింది.

ఆనందరావు ఆమె కళ్ళల్లోకి చూశాడు.

ఇప్పుడామె స్పష్టంగా కనిపించటం లేద తనికళ్ళకి.

ఇద్దరి మధ్యా అస్పష్టంగా ఏవో తెరలు!

● ● ●

వారం తిరగలేదు. ఆనందరావు పేర సుజాత దగ్గిర నుంచి ఉత్తర మొచ్చింది.

"ఆనందూ!

ఎన్నాళ్ళ తరవాతనో నిన్ను చూడగలిగా నన్న ఆనందం నీవు వెలిబుచ్చిన 'ప్రేమ' లో కొట్టుకుపోయింది. నిన్నొకప్పుడు ప్రేమించాను. పెళ్ళి చేసుకోవాలనుకున్నాను. నీ పిరికితనమే నిన్ను నా నుంచి దూరం చేసింది. కానీ, ఒంటరి ఆడది. పెళ్ళయిందని తెలిసికూడా నువ్వు కోరుకున్నప్పుడు ఆ పిరికితనం ఏమయిందో నా కర్థం కాలేదు. ఆడది కావాలి కానీ ఆమె జీవితానికి రక్షణ కల్పించడానికి మాత్రం నువ్వు రిస్కు తీసుకోలేవు. అంతేనా?

ఎన్ని కష్టాలనుభవిస్తున్నా ప్రియుడి ముందు ఏ స్త్రీ లొంగిపోయి తక్కువై పోదు. అందుకే పిల్లల కోసం పరితపించే నేను నీతో అబద్ధం చెప్పి తప్పించుకోవాల్సి వచ్చింది. క్షమించు.

—సుజ.—

రెండు రోజుల తరవాత ఆనందరావు నుండి ఉత్తరా న్నందుకుంది సుజాత.

"సుజా,

ప్రేమల్లో, ఊహాలోకాల్లో జీవితాల్ని గడిపేయలేమని నాకూ తెలుసు. ఒకప్పటి ప్రేయసి ఒంటరిగా ఒక రాత్రి కలిస్తే తప్పు చేయకూడ దనుకున్నా. లోకం మాటెలా ఉన్నా, ఆ తరవాత నువ్వు నన్నో మగాడి కింద జమ కట్టా వన్న ఆలోచన నన్నా పనికి ప్రేరేపించింది.

కోర్కె మానవ సహజం.

'తప్పు' అన్నది మనం సృష్టించుకున్న మాట —అవునా?

ప్రేమ మనసుకు సంబంధించినదని నీ వాదన.

ప్రేమ లోనే కోర్కె ఉందని నా అభిప్రాయం.

నాకు పెళ్ళయిందనీ, ముగ్గురు పిల్లల తరవాత నేను ఆపరేషన్ చేయించుకున్నాననీ చెబితే ఆశ్చర్యపోతావు కదూ?

కొన్ని అబద్ధాలు, కొన్ని తెరలు ఉంటేనే జీవితం అందంగా కనిపించేది!

అవునా?

నన్నర్థం చేసుకుంటావని తలుస్తూ...

—ఆనందు.' ★